క్లుప్తంగా

చిన్నారుల నృత్యాలు భేష్



శిల్పారామంలో చిన్నారుల నృత్య ప్రదర్శన

కడప కల్చరల్ : కడప శిల్పారామంలో ఆదివారం ఆటవిడుపు కార్యక్రమంలో భాగంగా స్థానిక అఖిల్ డ్యాన్స్ అకాడమి చిన్నారులు తమ నృత్యాలతో సందర్శకులతో భేష్ అనిపించుకున్నారు. ఇటీవల విస్తృత ప్రచారంలో ఉన్న సినిమా పాటలతోపాటు జానపద గీతాలకు కూడా వారు హుషారు గొలిపే నృత్యాలతో ఆకట్టుకున్నారు. సందర్శకులు వారిని అడుగడుగునా ప్రోత్సహిస్తూ కరతాళ ధ్వనులు చేశారు. శిల్పారామం ఏఓ శివప్రసాద్‌రెడ్డి కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

చిల్డ్రన్స్ హోమ్ ప్రారంభం



హోంలో చేరిన చిన్నారులతో అతిథులు, నిర్వాహకులు

కడప కల్చరల్ : బాసట స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక ఎన్జీఓ కాలనీలో బాసట చిల్డ్రన్స్ హోమ్‌ను ప్రారంభించారు. అతిథిగా హాజరైన హౌసింగ్ బోర్డు శ్రీ కోదండరామాలయం ధర్మకర్త వెంకటరెడ్డి హోమ్‌ను ప్రారంభించిన అనంతరం పూజల్లో పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నేటి సమాజంలో తమ తప్పు లేకపోయినా పరిస్థితుల ప్రభావంతో తల్లిదండ్రులకు దూరమై.. ఆదరణ లేక సమాజ వ్యతిరేక శక్తులుగా మారుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇలాంటి దశలో అనాథ బాలలకు అండగా నిలుస్తూ హోమ్ నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో గీతా ప్రవచనకర్త ముకుందరెడ్డి, బాసట సంస్థ నిర్వాహకులు మేరువ బాలాజీరావు, నగరానికి చెందిన ప్రముఖ వైద్యులు మధుసూదన్‌రెడ్డి, ఫణి కుమార్, బాలసుబ్రమణ్యం పాల్గొన్నారు.

బీజేపీ పార్లమెంట్ కన్వీనర్‌గా ఎంపిక



బొమ్మన సుబ్బరాయుడు

కడప కోటిరెడ్డిసర్కిల్ : సాధారణ ఎన్నికల నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా పార్లమెంటు నియోజకవర్గ కన్వీనర్లను బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి ప్రకటించారు. కడప బీజేపీ పార్లమెంటు కన్వీనర్‌గా బొమ్మన సుబ్బరాయుడును నియమించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత పదేళ్లుగా పార్టీకోసం అహర్నిశలు కష్టపడుతూ ప్రజలకు సేవ చేస్తున్నందుకు తన సేవలను గుర్తించి బీజేపీ రాష్ట్ర అధిష్టానవర్గం తనను ఎంపిక చేసిందన్నారు. ఈ సందర్భంగా తనకు సహకరించిన బీజేపీ జాతీయ కార్యదర్శి సత్యకుమార్, రాష్ట్ర సంఘటన్ కార్యదర్శి మధుకర్‌జీ, రాజ్యసభ సభ్యులు సీఎం రమేష్, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆదినారాయణరెడ్డి, జిల్లా అధ్యక్షులు వంగల శశిభూషణరెడ్డిలకు ధన్యవాదాలు తెలియజేశారు.

ఆశీర్వాదం



కడప కార్పొరేషన్: కడప నగరపాలక సంస్థ అసిస్టెంట్ సిటీ ప్లానర్ నాగేంద్ర కుమార్తె డాక్టర్ సువర్ణ, డాక్టర్ శ్రీనివాస్‌ల నిశ్చితార్థ వేడుక ఘనంగా జరిగింది. నగర శివారులోని డీఎస్‌ఆర్ కల్యాణ మండపంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, నగర మేయర్ కె.సురేష్ బాబు, కమిషనర్ జీఎస్‌ఎస్ ప్రవీణ్‌చంద్, ఇతర అధికారులు హాజరై కాబోయే వధూవరులను ఆశీర్వదించి, శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీసీపీ సూరజ్ కుమార్, డీటీసీపీ క్రిష్ణసింగ్, టౌన్‌ప్లానింగ్ సూపరింటెండెంట్ జి.శివకుమార్, తారక్ పాల్గొన్నారు.

కాంట్రాక్టు కార్మికులను క్రమబద్ధీకరించాలి



మాట్లాడుతున్న బి. రామలింగారెడ్డి

కడప కార్పొరేషన్ : విద్యుత్ సంస్థలలో పని చేస్తున్న పొరుగు సేవల ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని ఏపీ ఎలక్ట్రిసిటీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ) రాష్ట్ర అధ్యక్షుడు రామలింగారెడ్డి డిమాండ్ చేశారు. కడప నగరంలోని ఏపీఎస్‌ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ కార్యాలయంలో ఆదివారం విద్యుత్ కాంట్రాక్టు ఉద్యోగుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్పాట్ బిల్లింగ్ చేసే కార్మికులకు కనీస వేతనం అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ వార్డు సచివాలయ ఎనర్జీ ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మల్లికార్జునరెడ్డి, ఎలక్ట్రిసిటీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ అదనపు కార్యదర్శి బ్రహ్మానందరెడ్డి, యూనియన్ జిల్లా అధ్యక్షులు లక్ష్మీనారాయణ, ఈశ్వరయ్య, నాగిరెడ్డి, విశ్వనాథరెడ్డి, జయక్రిష్ణారెడ్డి, నాగరత్నఆచారి, కొండారెడ్డి, గఫార్ పాల్గొన్నారు.

విశ్వసనీయతకు నిలువెత్తు రూపం జగనన్న

- ఉప ముఖ్యమంత్రి ఎస్.బి.అంజద్‌బాషా
- నాలుగో విడత వైఎస్‌ఆర్ ఆసరా మంజూరు
- 35525 మందికి రూ.32.81 కోట్లు కేటాయింపు



వైఎస్‌ఆర్ ఆసరా సభలో పాల్గొన్న మహిళలు



స్వయం సహాయ సంఘాల మహిళలకు మెగా చెక్ అందజేస్తున్న డిప్యూటీ సీఎం అంజద్‌బాషా

కడప కార్పొరేషన్: విశ్వసనీయతకు నిలువెత్తు రూపం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని ఉప ముఖ్యమంత్రి ఎస్‌బీ అంజద్‌బాషా పేర్కొన్నారు. ఆదివారం స్థానిక బళ్లారిరోడ్డు ఆయేషా స్కూల్ వెనుక మైదానంలో కడప నగరపాలక సంస్థ, మెప్మా వారి ఆధ్వర్యంలో 4వ విడత వైఎస్సార్ ఆసరా కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వై.యస్.ఆర్ ఆసరా కార్యక్రమాన్ని నాల్గవ సంవత్సరం కూడా 35525 మంది లబ్ధిదారుల ఖాతాలకు రూ.32.81 కోట్లు జమ చేయడం జరిగిందన్నారు. ఈ నాలుగేళ్లలో కడప నగరంలోని లబ్ధిదారులకు సుమారు రూ.100 కోట్లను జగనన్న వైయస్సార్ ఆసరా పథకం కింద అందించడం జరిగిందన్నారు. గత ప్రభుత్వాల వలే ఇది మాటల ప్రభుత్వం కాదని, చేతల ప్రభుత్వం అని, మ్యానిఫెస్టో అంటే అంకెల గారడీ కాదని, అది ఒక పవిత్రమైన భగవద్గీత, బైబిల్, ఖురాన్‌లా భావించడం జరుగుతోందన్నారు. గత టీడీపీ ప్రభుత్వం రుణాలు మాఫీ చేస్తామని, రుణాలు కట్టొద్దని పిలుపునిచ్చి తరువాత మోసం చేసిన పరిస్థితులలో.. మహిళలు ఆ రుణాలు కట్టలేక చివరకు వడ్డీ కూడా చెల్లించలేక, రుణభారం తడిసి మోపెడై దయనీయమైన పరిస్థితుల్లోకి నెట్టబడ్డారన్నారు. ఫలితంగా మహిళా సంఘాలు చిన్నాభిన్నమై ×ఏ్రగేడ్ లో ఉన్న సంఘాలు కూడా ×స్టి, ×డ్రిగ్రేడ్ లోకి పడిపోయాయన్నారు. మహిళల ఆర్థిక ఇబ్బందులను ఎన్నికల ముందు పాదయాత్రలో కళ్లారా చూసిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బ్యాంకు రుణాల మొత్తం ఎస్.ఎల్.బి.సి. వారి తుది జాబితా ప్రకారం 7.98 లక్షల మహిళా సంఘాలలోని 78.94 లక్షల అక్క చెల్లెమ్మలకు ఉన్న అప్పు నిల్వ రూ.25, 571 కోట్లను 4 దఫాలుగా నేరుగా పొదుపు సంఘాల ఖాతాల ద్వారా అందిస్తానని హామీ ఇచ్చారని, ఇచ్చిన మాట చిత్తశుద్ధితో అమలు పరిచారన్నారు. 2016లో రద్దయిన సున్నా వడ్డీ పథకాన్ని మళ్లీ పునరుద్ధరించడం జరిగిందన్నారు. అక్క చెల్లెమ్మల జీవితాల్లో మరిన్ని కాంతులు తీసుకురావాలని, వారి కుటుంబంలో సుస్థిరమైన ఆదాయం రావాలని, జీవనోపాధి మెరుగుపరచుకొనే విధంగా గత ఏడాది అమూల్, హిందూస్తాన్ యూని లివర్, ఐ.టి.సి., ప్రోక్టర్ అండ్ గ్యాంబల్, అలానా వంటి వ్యాపార దిగ్గజాలతో, బ్యాంకులతో ఒప్పందాలు చేసుకోవడం జరిగిందన్నారు. ఈ ఏడాది అజియో, రిలయన్స్, గ్రామీణ వికాస కేంద్రం, టీనేజర్, మహేంద్ర - ఖేతి వంటి బహుళ జాతి సంస్థలతో ఒప్పందాలు చేసుకొని మీకు వ్యాపార మార్గాలు చూపించడం జరుగుతోందన్నారు.

అమ్మ కడుపులోని బిడ్డ నుంచి అవ్వాయంగా ఆశీర్వదించే అవ్వ వరకు.. ప్రతి ఒక్కరి అవసరాలను గుర్తించి తగు పథకాలను అమలు చేస్తున్నారన్నారు. అమ్మఒడి, విద్యా దీవెన, వసతి దీవెన, చేయూత, సున్నా వడ్డీ, కావు నేస్తం, కళ్యాణమస్తు, ఇళ్ల పట్టాలు అక్కచెల్లెమ్మల పేరుతోనే ఇస్తున్నారని, అన్ని నామినేషన్ పోస్టులు, నామినేటెడ్ పనులలో చట్టం చేసి 50 శాతం మహిళలకు కేటాయించడం జరిగిందన్నారు. వృద్ధాప్య, వితంతు పింఛన్లు, మహిళల రక్షణ కోసం దిశబిల్లు ప్రవేశపెట్టడం జరిగిందన్నారు. అనంతరం మహిళా లబ్ధిదారులకు మెగా చెక్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు అహ్మద్‌బాషా, సుభాన్ బాషా, కార్పొరేటర్లు షఫీ, చెన్నయ్య, అరీఫుల్లా బాషా, అజ్మతుల్లా, జప్రుల్లా, షంషీర్, నాయకులు అలీ అక్బర్, బసవరాజు, కమాల్‌బాషా, కె.రాజశేఖర్ రెడ్డి, తోటక్రిష్ణ, దాసరి శివప్రసాద్, పత్తి రాజేశ్వరి, బండి మరియలు, టీపీ వెంకట సుబ్బమ్మ, సీఎంఎం హరిప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం స్వయం సహాయ సంఘాల మహిళలకు నాలుగు విడతల్లో పూర్తి రుణ మాఫీ చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి మహిళలు క్షీరాభిషేకం నిర్వహించారు. జై జగన్ అంటూ నినాదాలు చేశారు.

ప్రతి కుటుంబానికీ సంక్షేమ పథకాలు

- 'గడప గడపకు మన ప్రభుత్వం'లో డిప్యూటీ సీఎం అంజద్‌బాషా



ప్రజలతో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం అంజద్‌బాషా

కడప కార్పొరేషన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో దాదాపు ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు సంతృప్తిగా అందుతున్నాయని ఉప ముఖ్యమంత్రి ఎస్‌బీ అంజద్‌బాషా అన్నారు. ఆదివారం స్థానిక 21వ డివిజన్‌లోని ద్వారకా నగర్, క్రిష్ణ మందిరం ప్రాంతాల్లో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా ఆయన ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల ద్వారా ఆయా కుటుంబాలకు కలిగిన లబ్ధిని తెలుసుకున్నారు. ఇంకా అర్హులెవరికైనా పథకాలు అందలేదా అని ఆరా తీశారు. అనంతరం ముఖ్యమంత్రి వైఎస్ జగన్ సంతకంతో కూడిన బుక్‌లెట్‌ను వారికి అందజేసి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని ఆశీర్వదించాలని కోరారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ పాదయాత్రలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల కష్టాలు తెలుసుకొని, వారి సంక్షేమం కోసం నవరత్నాల పథకాలను ప్రవేశపెట్టి ఎటువంటి అవినీతికి తావు లేకుండా పారదర్శకంగా అమలు చేస్తున్నారన్నారు. దేశంలో ఇన్ని రాష్ట్రాలు ఉన్నా.. ఇంత గొప్పగా పేదల గురించి ఆలోచించి సంక్షేమ పథకాలు అమలు చేయలేదన్నారు. సంవత్సరంలో ప్రతి నెల క్యాలెండర్ పద్ధతిలో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని కొనియాడారు. దేశంలో ఎక్కడా లేని విధంగా నూతన సచివాలయ వ్యవస్థను తీసుకుని వచ్చి వలంటీర్ల ద్వారా సంక్షేమ పథకాలను ఇంటి ముంగిటకు చేర్చామన్నారు. గత ప్రభుత్వాలు అవ్వతాతల గురించి ఆలోచన చేయలేదని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి.. వారి ముఖంలో చిరునవ్వులు చూడాలని ప్రతినెల ఒకటో తేదీ ఉదయాన్నే తెల్లవారుజామునే ఇంటి తలుపుతట్టి పింఛన్లు అందజేసేలా చర్యలు తీసుకున్నారని తెలిపారు. అర్హత ఉండి ఇంకా ఎవరైనా సంక్షేమ పథకాలు కోల్పోయి ఉంటే.. వారి కోసం 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమాన్ని నిర్వహించి తిరిగి వారికి సంక్షేమ పథకాలు అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో హరూన్ గ్రూప్స్ ఎండీ అహ్మద్‌బాషా, ఏపీ సోషల్ వెల్ఫేర్ బోర్డు చైర్మన్ పులి సునీల్, డిప్యూటీ మేయర్ నిత్యానందరెడ్డి, 21 వ డివిజన్ కార్పొరేటర్ ఎం.సుజాత, ఇన్‌చార్జి ఎం.సుబ్బరాయుడు, వైఎస్సార్‌సీపీ నాయకులు బంగారు నాగయ్య యాదవ్, హఫీజుల్లా, షఫీ, త్యాగరాజు, ఎస్.సుబ్బా రెడ్డి, చెన్నయ్య, బాలక్రిష్ణారెడ్డి, తోటక్రిష్ణ, రామ్మోహన్‌రెడ్డి, రహీం తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల యుద్ధానికి సిద్ధం కావాలి



సిద్ధం పోస్టర్లు ఆవిష్కరిస్తున్న కమలాపురం ఎమ్మెల్యే పి. రవీంద్రనాథ్‌రెడ్డి

- కమలాపురం ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి

కడప కార్పొరేషన్ : రాబోవు ఎన్నికల యుద్ధానికి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని కమలాపురం శాసనసభ్యుడు పి.రవీంద్రనాథ్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక పాతిమా కళాశాల సమీపంలోని మహాలక్ష్మి కల్యాణ మండపంలో కమలాపురం నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు వందకు వంద శాతం అమలు చేసిందన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల వల్ల ప్రతి ఇంటికీ లక్ష నుంచి రూ.10 లక్షల వరకూ లబ్ధి చేకూరిందన్నారు. రూ.2.60 లక్షల కోట్లు డీబీటీ ద్వారా ప్రజల ఖాతాల్లోకి నేరుగా జమ చేయడం జరిందన్నారు. ఇంత పారదర్శకంగా పథకాల అమలు దేశంలో మరే ప్రభుత్వాలు చేయలేదన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలందరికీ అధికారంలో భాగస్వామ్యం కల్పించి, కీలక పదవులు వారికే ఇచ్చారన్నారు. మళ్లీ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఎదుర్కోవడానికి.. ప్రతిపక్షాలన్నీ ఏకమై ప్రభుత్వంపై బురదజల్లుతూ వస్తున్నాయన్నారు. ఎవరు ఎన్ని కుట్రలు, కుతంత్రాలు పన్నినా వైఎస్సార్‌సీపీ 175కు 175 సీట్లు సాధించడం తథ్యమని ధీమా వ్యక్తం చేశారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు దీన్ని సమర్థవంతంగా ఎదుర్కోవాలని వివరించారు. అనంతరం సిద్ధం అంటూ రూపొందించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షులు వీరారెడ్డి, మాచునూరు చంద్రారెడ్డి, రఘునాథరెడ్డి, జీఎస్ భాస్కర్‌రెడ్డి, డిప్యూటీ మేయర్ నిత్యానందరెడ్డి, బంగారు నాగయ్య యాదవ్, శంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'పల్లెకు పోదాం'ను జయప్రదం చేయాలి



మాట్లాడుతున్న రమేష్‌నాయుడు

కడప కోటిరెడ్డిసర్కిల్ : ప్రధానమంత్రి నరేంద్రమోదీ నేతృత్వంలో కేంద్ర ప్రభుత్వం గత పదేళ్లలో చేపట్టిన సంక్షేమ పథకాలను పల్లెకు పోదాం బీజేపీ పేరుతో ప్రతి ఇంటికి వెళ్లి వివరించే కార్యక్రమాన్ని చేపట్టామని రాజ్యసభ సభ్యుడు సీఎం రమేష్‌నాయుడు తెలిపారు. ఆదివారం బీజేపీ జిల్లా అధ్యక్షుడు వంగల శశిభూషణ్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సమాజంలో వివిధ రంగాలలో సేవా కార్యక్రమాలు చేసిన వారిని గౌరవించడం లాంటి కార్యక్రమాలు కూడా గ్రామ స్థాయిలో చేయాలని నిర్ణయించామన్నారు. బీజేపీ జాతీయ అధ్యక్షులు జేపీ నడ్డా నాయకత్వంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి సూచన మేరకు పల్లెకు పోదాం అనే కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. ఈ కార్యక్రమంలో రాయలసీమ జిల్లాల ఇన్‌చార్జి బాలకృష్ణ యాదవ్, జిల్లా కన్వీనర్ కేవీ లక్ష్మినారాయణరెడ్డి, మాజీ శాసనసభ్యులు జయరాములు, గాలి హరిప్రసాద్, జిల్లా ప్రధాన కార్యదర్శులు, అసెంబ్లీ కన్వీనర్లు, కో కన్వీనర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు డ్రైవర్లకు ఉచిత వైద్య శిబిరం

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : 35వ జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల సందర్భంగా సోమవారం నగర శివారులోని ఊటుకూరు జిల్లా ఉప రవాణా శాఖ కమిషనర్ కార్యాలయంలో డ్రైవర్లు, వారి కుటుంబ సభ్యులకు ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు డీటీసీ ఈ.మీరాప్రసాద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని వాహన డ్రైవర్లు, వారి కుటుంబ సభ్యులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

శాసనాల్లో పుష్కలంగా సాహితీ విశేషాలు



డాక్టర్ నాగోలు కృష్ణారెడ్డిని సత్కరిస్తున్న నిర్వాహకులు

కడప కల్చరల్ : రాయలసీమలో లభించిన శాసనాలలో సాహితీ విశేషాలు పుష్కలంగా ఉన్నాయని టీటీడీ శ్రీ వెంకటేశ్వర సంగ్రహాలయం ప్రత్యేక విధుల అధికారి డాక్టర్ నాగోలు కృష్ణారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం యోగి వేమన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలోని సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం నిర్వహిస్తున్న ×నెలనెలా సీమ సాహిత్యం¥ కార్యక్రమంలో భాగంగా ఆదివారం బ్రౌన్‌శాస్త్రి సమావేశ మందిరంలో 128వ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు నేలలో వీర శిలాశాసనాలు రాయలసీమలోనే ఎక్కువగా లభించాయన్నారు. వాటిలో అనేక శ్లోకాలు ఉన్నాయని ఉదాహరణలతో వివరించారు. శ్లోకకర్తల వివరాలు మాత్రం లేవని, వైఎస్సార్ జిల్లాలోని గంగ పేరూరులో తొలి వీర శిలాశాసనం లభించిందన్నారు. జైన గురువు సింహనంది ఇక్కడి వారేనని ఈ శాసనం ద్వారా స్పష్టమైందన్నారు. రాయలసీమలోని కలమల్లలో రేనాటి చోళుల తొలి తెలుగు శాసనం లభించిందన్నారు. కోగటం శాసనం ద్వారా అల్లసాని పెద్దన, తుడుములదిన్నె శాసనం ద్వారా నాచన సోమన వైఎస్సార్ జిల్లా వారని స్పష్టమైందన్నారు. రాయలసీమలో తొలి తామ్రశాసనంగా కర్నూలు అలవకొండ శాసనాన్ని గుర్తించారన్నారు. మన జిల్లాలోని తిప్పలూరు అగ్రహారం అష్టదిగ్గజాలకు ఇచ్చినట్లు అక్కడి శాసనం తెలుపుతోందన్నారు. కార్యక్రమం ప్రారంభంలో డాక్టర్ నాగోలు కృష్ణారెడ్డిని బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సంచాలకులు ఆచార్య తొప్పెట రామప్రసాదరెడ్డి, సహాయ పరిశోధకులు డాక్టర్ భూతపురి గోపాలకృష్ణశాస్త్రి, డాక్టర్ చింతకుంట శివారెడ్డి, గ్రంథపాలకులు ఎస్.రమేశ్‌రావు, జూనియర్ అసిస్టెంట్లు ఆర్.వెంకటరమణ, ఎం.మౌనికలు సత్కరించారు. కార్యక్రమంలో ఈదుమూడి లక్ష్మీనారాయణ, కొత్తపల్లి రామాంజనేయులు, ఎస్.ఆర్.ప్రతాపరెడ్డి, బాల రాజేశ్వరరెడ్డి, ఎస్.నాగముని మధుబాబు తదితరులు పాల్గొన్నారు.

'కళాభిరామ' పురస్కారం ప్రదానం



మూల మల్లికార్జునరెడ్డిని సత్కరిస్తున్న నిర్వాహకులు

కడప కల్చరల్ : యోగి వేమన విశ్వవిద్యాలయం పాలక మండలి సభ్యులు ఆచార్య మూల మల్లికార్జున రెడ్డిని హైదరాబాదుకు చెందిన లలిత కళాభిరామ పింఛము సంస్థ పురస్కారాన్ని అందజేసింది. నిర్వాహకులు, చిత్ర శిల్పకారులు, రాష్ట్ర హంస పురస్కార గ్రహీత గొల్లపల్లి జయన్న, చిత్రకారిణి మంజుల ఆధ్వర్యంలో ఆదివారం హైదరాబాదు రవీంద్రభారతిలో జరిగిన కార్యక్రమంలో ఆయనను ఘనంగా సత్కరించి పురస్కారం అందజేశారు. తెలుగు నాటక రంగానికి ఆయన అందించిన సేవలకు ఇటీవల రాష్ట్ర ప్రభుత్వ నంది పురస్కారం లభించిన విషయం తెలిసిందే. ఈ సేవలను ప్రశంసిస్తూ లలిత కళాభిరామ పింఛము సంస్థ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు సంబంధించి తమ 19వ వార్షికోత్సవ సభలో ఆయనకు పురస్కారం అందజేశారు. నిర్వాహకులు జయన్న, మంజుల మాట్లాడుతూ రాయలసీమలో నాటకరంగం బలహీన పడిన ఈ దశలో మల్లికార్జునరెడ్డి లాంటి వారు తిరిగి జీవం పోసే ప్రయత్నాలు చేయడం అభినందనీయమన్నారు. సీమలో ఎందరో అద్భుతమైన చిత్రకారులు, నటులు, కళాకారులు ఉన్నారని, ప్రోత్సాహం లభిస్తే ప్రతిభను చాటగలరని కొనియాడారు. పురస్కార గ్రహీత మల్లికార్జునరెడ్డి మాట్లాడుతూ రాయలసీమలో అన్ని కళలకు చెందిన రతనాల్లాంటి కళాకారులు ఉన్నారని, ఇప్పటికే తమ విభాగాల్లో తారాస్థాయికి చేరారని తెలిపారు. తనకు ఈ పురస్కారం అందించడం తన బాధ్యతను పెంచిందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖులు పద్మశ్రీ డాక్టర్ త్రిపురనేని హనుమాన్ చౌదరి, కళ్ళేపు సాగరరావు, డాక్టర్ యక్కలూరి శ్రీరాములు, అన్నమరాజు ప్రభాకరరావు తదితరులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్‌ను పూడ్చేస్తున్నా పట్టించుకోరా?



ఉక్కాయపల్లె వద్ద ట్రాన్స్‌ఫార్మర్‌ను మట్టితో పూడ్చేస్తున్న దృశ్యం

కడప కార్పొరేషన్: కడప నగరం ఉక్కాయపల్లె సమీపంలో మాచుపల్లె రోడ్డు పక్కన ఖాళీ జాగాలో మట్టి తోలే క్రమంలో కొందరు వ్యక్తులు ట్రాన్స్‌ఫార్మర్‌ను కూడా పూడ్చేస్తున్నారు. ఎంతో విలువజేసే ఎర్త్ రాడ్లు, కేబుల్ వైర్లు, ఇతరత్రా సామగ్రిని ఇదివరకే పూడ్చేశారు. ట్రాన్స్‌ఫార్మర్‌కు కూడా సగం వరకూ మట్టి తోలారు. రెండు, మూడు వేలు బకాయి ఉంటేనే.. కరెంట్ కట్ చేసి ముక్కుపిండి వసూలు చేసే విద్యుత్ శాఖ అధికారులు లక్షల విలువజేసే ట్రాన్స్‌ఫార్మర్‌ను మట్టితో పూడ్చివేస్తున్నా పట్టించుకోకపోవడం పట్ల తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ ప్రాంతంలో పని చేస్తున్న విద్యుత్ శాఖ సిబ్బంది నిర్లక్ష్యం వల్లే ఇదంతా జరుగుతోందని తెలుస్తోంది. చలమారెడ్డిపల్లె నుంచి తిలక్‌నగర్‌లోకి వెళ్లే మార్గంలో రోడ్డు మధ్యలో విద్యుత్ స్తంభాలున్నాయని 'సాక్షి' వెలుగులోకి తీసుకొచ్చినా సరే వారు పట్టించుకున్న పాపాన పోలేదు. రోడ్డుకు అడ్డంగా ఉన్న స్తంభాల వల్ల ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని స్థానిక ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. ఇప్పడైనా అధికారులు స్పందించి ఎంతో విలువ జేసే ట్రాన్స్‌ఫార్మర్ మట్టిలో కలిసిపోకుండా చూడాలని పలువురు కోరుతున్నారు.

చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలి



బహుమతులు అందజేస్తున్న నిర్వాహకులు

కడప ఎడ్యుకేషన్ : నేటి పోటీ ప్రపంచంలో విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని అప్పుడే వారు మానసికంగా ఉల్లాసంగా ఉంటారని మాంటిస్సోరీ జగతి ఇంటర్నేషనల్ స్కూల్ కరస్పాండెంట్ లేవాకు నితీష్‌రెడ్డి, చెస్ అసోసియేషన్ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ రామసుబ్బారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం కడప నగర శివార్లలోని మాంటిస్సోరి జగతి ఇంటర్నేషనల్ స్కూల్‌లో రాష్ట్రస్థాయి చెస్ పోటీలు జరిగాయి. విజయవాడ, గుంటూరు, అనంతపురం, తిరుపతి, వైఎస్సార్ జిల్లాల నుంచి 198 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. మొదటి స్థానంలో అనంతపురానికి చెందిన కుషాల్ నిలువగా, రెండవ స్థానంలో తిరుపతికి చెందిన వెలుగోటి యాతిన్‌రెడ్డి, మూడవ స్థానంలో అనంతపురానికి చెందిన వెంకటరమణ నిలిచారు. విజేతలకు మాంటిస్సోరీ జగతి ఇంటర్నేషనల్ స్కూల్ కరస్పాండెంట్ లేవాకు నితీష్‌రెడ్డి లక్ష రూపాయల ప్రైజ్ మనీతోపాటు కప్పులను అందజేశారు. అలాగే పోటీలలో పాల్గొన్న అందరికి మెడల్స్, సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. కార్యక్రమంలో చెస్ అసోసియేషన్ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ రామసుబ్బారెడ్డి, చెస్ అసోసియేషన్ ప్రతినిధులు నాగార్జున, ఫణికుమార్, సుదర్శన్‌రెడ్డి, హిమ్మత్, సురేంద్ర, రాయుడు, మాధవి, తేజశ్రీ, అనంత్‌తోపాటు మాంటిస్సోరీ జగతి ఇంటర్నేషనల్ స్కూల్ ప్రిన్సిపాల్ సుదర్శన్‌రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ సురేంద్ర, చందు తదితరులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప నగరంలోని చిన్నచౌకు పోలీసుస్టేషన్ వద్ద ఆదివారం సాయంత్రం పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. ఎస్‌ఐలు రవికుమార్, మహమ్మద్ రఫీలు తమ సిబ్బందితో ఈ తనిఖీలు నిర్వహించారు. వాహనాలకు సంబంధించిన పత్రాలు లేని వారికి జరిమానాలు విధించామని వారు తెలిపారు. ప్రతి వాహనదారుడు తమ వాహనానికి సంబంధించిన పత్రాలు తమ వద్ద ఉంచుకోవాలని, రహదారుల నిబంధనలు పాటించాలని సూచించారు.

జూదరుల అరెస్ట్

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప నగరంలోని టూటౌన్ పోలీసుస్టేషన్ పరిధిలో ఎనిమిది మంది జూదరులను అరెస్టు చేసి, వారి వద్ద నుంచి రూ.4600 నగదు, పేకముక్కలను స్వాధీనం చేసుకున్నామని ఎస్‌ఐ సంజీవరాయుడు తెలిపారు. మార్కెట్ యార్డు వెనుక వైపు కంపచెట్లలో జూదమాడుతుండగా తమ సిబ్బందితో వెళ్లి అరెస్టు చేశామని వివరించారు.

అవార్డు గ్రహీతకు సన్మానం



అంబవరం ప్రభాకర్‌రెడ్డిని సన్మానిస్తున్న విద్యార్థులు

కడప ఎడ్యుకేషన్ : జిల్లా సమగ్రశిక్ష ప్రాజెక్టు అధికారిగా పని చేస్తున్న అంబవరం ప్రభాకర్‌రెడ్డికి వరుసగా 5 సార్లు జిల్లా ఉత్తమ అధికారి అవార్డు రావడం హర్షణీయం అని మౌలానా ఎడ్యుకేషన్ సొసైటీ ప్రెసిడెంట్ షబ్బీర్ పేర్కొన్నారు. కడపలోని నిహార్‌స్కిల్ సెంటర్‌లో జిల్లా ఉత్తమ అధికారి అవార్డు గ్రహీత అంబవరం ప్రభాకర్‌రెడ్డిని మౌలానా ఎడ్యుకేషనల్ అండ్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు షేక్ అబ్దుల్ షబ్బీర్ ఆధ్వర్యంలో అభినందన సభను ఏర్పాటు చేసి విద్యార్థుల సమక్షంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సీఆర్‌ఐ సుబ్బారెడ్డి చారిటబుల్ ట్రస్టు అధ్యక్షుడు సీఆర్‌ఐ సునీల్ జయంత్, నిహార్ స్కిల్ సెంటర్ స్టాఫ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులను నియమించాలి



మాట్లాడుతున్న మేకల శివార్జున

కడప ఎడ్యుకేషన్: రాష్ట్ర ప్రభుత్వం నాడు నేడు కింద పాఠశాలలను ఎంతో అభివృద్ధి చేసిందని, దీంతో పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య బాగా పెరిగిందని, కాకపోతే పెరిగిన విద్యార్థులకు అనుగుణంగా ఉపాధ్యాయులను కూడా నియమించాలని ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మేకల శివార్జున పేర్కొన్నారు. ఆదివారం కడపలోని ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘ కార్యాలయంలో ముఖ్య నాయకుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియంతోపాటు తెలుగు మీడియంను ప్రవేశ పెట్టాలన్నారు. దీంతోపాటు విద్యార్థులుసామర్థ్యాలను బట్టి రెండు, మూడు రకాల ప్రశ్నాపత్రాలను తయారు చేయాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు శేషగిరిరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి గంగరాజు, జిల్లా కార్యదర్శి కట్టా గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమాలకు పాల్పడే వారిపై చర్యలు తీసుకోవాలి

కడప ఎడ్యుకేషన్: ఉమ్మడిజిల్లాలో ప్రాక్టికల్ పేరుతో కొన్ని కార్పొరేట్, ప్రైవేటు విద్యాసంస్థలు విద్యార్థులు, వారి తల్లిదండ్రుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నాయని, అలాంటి కళాశాలలపై చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి శ్రీనాథ్‌యాదవ్ పేర్కొన్నారు. ఆదివారం కడపలోని పీడీఎస్‌యూ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. జూనియర్ కళాశాలలో చదువుతున్న విద్యార్థులకు ఫిబ్రవరి 5వ తేదీ నుంచి ప్రాక్టికల్ పరీక్షలు ప్రారంభం కానున్నాయన్నారు. ఈ నేపథ్యంలో కొన్ని కార్పొరేట్, ప్రైవేటు కళాశాలలకు చెందిన యాజమాన్యాలు ప్రాక్టికల్స్‌లో మార్కులు వేయిస్తామని మాయ మాటలు చెప్పి విద్యార్థుల నుంచి 1500 నుంచి 2 వేలు వరకు డబ్బులు వసూలు చేస్తున్నాయని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ నగర కార్యదర్శి గణేష్, నాయకులు సందీప్, సంతోష్, సాయి, పవన్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

రూ.5 వేల జీవనభృతి చెల్లించాలి

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఏపీఎస్ ఆర్టీసీలో 2014 సెప్టెంబరు 1వ తేదీకి ముందు రిటైర్డ్ అయిన కార్మికులకు నెలకు రూ.5 వేల జీవనభృతి చెల్లించేందుకు కృషి చేయాలని వైఎస్సార్ ఆర్టీసీ రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ కార్యదర్శి ఎల్.రఘునాథ రెడ్డి కోరారు. ఆదివారం ఈ మేరకు ఆయన డిప్యూటీ సీఎం అంజద్‌బాషాను కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈనెల 31వ తేదీ జరిగే క్యాబినెట్ సమావేశంలో విషయాన్ని సీఎం దృష్టికి తీసుకు వెళ్లాలని కోరారు. ఇందుకు డిప్యూటీ సీఎం సానుకూలంగా స్పందించారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన

కమలాపురం : స్థానిక సీఎస్‌ఐ చర్చ్ మైదానంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఆదివారం కడప నగరానికి చెందిన డాక్టర్ మోహన్స్ డయాబెటీస్ సూపర్ స్పెషాలిటీస్ సెంటర్ వారు నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని చర్చ్ పాస్టర్ భరత్ హెరాల్డ్ ప్రత్యేక ఆరాధన నిర్వహించి ప్రారంభించారు. 150 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు.